క్లుప్తంగా

నిర్మాణ కార్మిక సంఘానికి స్థలం కేటాయించాలి

తాళ్లపూడి: మండల భవన నిర్మాణ కార్మికుల సంఘానికి సొంత భవనం నిర్మించుకునేందుకు వీలుగా తాళ్లపూడిలో స్థలాన్ని కేటాయించాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘ నాయకుడు మైగాపుల ఆంజనేయులు తాళ్లపూడి పంచాయతీ కార్యదర్శి ఆశా ఆలేఖ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలో సొంత భవనం లేకపోవడంతో సమావేశాలు నిర్వహించుకునేందుకు ఎన్నో ఏళ్లుగా భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆంజనేయులు వివరించారు. కార్యక్రమంలో తాళ్లపూడి ఉప సర్పంచ్ అప్పన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు వర్షిణి



వర్షిణిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దేవరపల్లి: జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కళ్లేపల్లి వర్షిణి ఎంపికైంది. విజయవాడలోని పడమట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరఫున పాల్గొన్న వర్షిణి ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైందని పీడీ ఓరుగంటి నాగరాజు బుధవారం తెలిపారు. డిసెంబరు 2,3,4 తేదీల్లో బీహార్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వర్షిణి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఇప్పటి వరకూ మూడు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన వర్షిణిని హెచ్‌ఎం బి.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, పీఈటీ లక్ష్మణరావు అభినందించారు.

కులగణనపై సిబ్బందికి శిక్షణ

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సమగ్ర కుల గణనపై సిబ్బందికి కొవ్వూరు పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కుల గణన విధి,విధానాలు,గణన నిర్వహణ తీరును గురించి అధికారులు వారికి వివరించారు. ఏపీ ప్రభుత్వం రూపొందించిన మొబైల్ యాప్‌లో సచివాలయాల కార్యదర్శులకు చూపించి, అందులోని ప్రశ్నలకు సమాధానాలు నింపే విధానంపై అవగాహన కల్పించారు.కుల గణన సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా వివరించారు. శిక్షణ అనంతరం సిబ్బంది సందేహాలను నివృత్తి చేసినట్టు మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు.ప్రజలంతా కుల గణనకు సహకరించాలని కోరారు.

జగతికి వెలుగునిచ్చేది శ్రీకృష్ణ భగవానుడే

నల్లజర్ల: సమస్త జగత్తుకు వెలుగు నిచ్చేది శ్రీకృష్ణ భగవానుడే అని ఇస్కాన్ గురు వంశీ కృష్ణదాస్ ప్రవచించారు. మండలంలోని కంపన దుర్గారావు ఇంటి వద్ద బుధవారం రాత్రి ఇస్కాన్ భక్తులు దామోదర లీలా మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంశీకృష్ణదాస్ మాట్లాడుతూ భగవంతుడిని మర్చిపోవడమే సమాజంలో అన్ని కష్టాలకూ కారణం అన్నారు. భగవంతుడే అన్నింటికీ మూలం అని తెలుసుకొని భవంతుడు మనకిచ్చిన దానికి ప్రతిగా దీపం రూపంలో సమర్పించాలన్నారు. అప్పుడే సమాజం అంతా శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీరంగదాస్, ప్రేమానందదాస్, సత్యనారాయణ, చెల్లు సుబ్రహ్మణ్యం, వీరవెంకటరావు, తలంశెట్టి వరలక్ష్మి, కూసంపూడి బుజ్జియ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దేవరపల్లికి చెందిన కోట సురేష్ కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ డి.సువర్ణరాజు బుధవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. సురేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో, అతడి భార్య, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. దీనితో సువర్ణరాజు ఈ ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అనిశెట్టి గంగరాజు, కంబాల సత్తిబాబు, సూరిశెట్టి బాలు, జాజిమొగ్గల శ్రీనివాస్, కవల వెంకన్న పాల్గొన్నారు.

బిల్డింగ్ కాంట్రాక్టర్స్ సంఘాధ్యక్షుడిగా మేడా వీకేవీ ప్రసాద్



చాగల్లు: ఏపీ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని నెలటూరుకు చెందిన మేడా వీకేవీ ప్రసాద్ ఎన్నికయ్యారు. వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో చాగల్లుకే చెందిన వర్ధినేడి చినబాబు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

నేడు దేవరపల్లిలో వన సమారాధన

దేవరపల్లి: దేవరపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరపల్లి-యాదవోలు రోడ్డులోని హైవే వద్ద గల కూచిపూడి బుల్లారావు పామాయిల్ తోటలో కార్తిక వనసమారాధన జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి రవికిషోర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే వనసమారాధనలో సర్పంచ్ కడిమి వీర కుమారి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావ తదితరులు పాల్గొంటారు.

గోరుముద్దకు కొత్త వంట పాత్రలు

- ప్రభుత్వ పాఠశాలలకు తగినన్ని సరఫరా
- మధ్యాహ్న భోజన నిర్వాహకులకు తప్పిన కష్టాలు
- సిల్వర్ పాత్రల స్థానంలో స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా 5 నుంచి 11 రకాల సామగ్రి



వంట పాత్రలను పాఠశాలలకు పంపిణీ చేసే ప్రక్రియలో విద్యా శాఖ సిబ్బంది



నిడదవోలు మండల ఎంఈఓ కార్యాలయంలో నూతన వంట పాత్రలు



సమిశ్రగూడెం హైస్కూల్లో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు (ఫైల్)

నిడదవోలు రూరల్: సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శుభవార్త. అరకొర పాత వంట పాత్రలతో వంటలు చేయాల్సిన పరిస్థితి వారికి ఇకపై ఉండదు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా భోజనాలు వండి వడ్డించేందుకు అవసరమైన కొత్త పాత్రలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. సిల్వర్ పాత్రల స్థానంలో నాణ్యమైన స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలను సమకూరుస్తోంది. జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని వడ్డిస్తోంది. మెనూలో ఈ ఏడాది రాగిజావను కూడా చేర్చారు. వీటిని తయారు చేసేందుకు అవసరమైన పాత్రలను సైతం సమకూరుస్తోంది. ఇప్పటికే మండల విద్యావనరుల కార్యాలయాలకు వంట పాత్రలు చేరాయి. ఎంఈఓల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలకు ఈ వంట పాత్రలను తరలిస్తున్నారు.

తీరనున్న ప్రధాన సమస్య

నిత్యం మధ్యాహ్న భోజనం వండి వార్చే ఏజెన్సీలకు వంట పాత్రల సమస్య వేధిస్తోంది. 2010లో అప్పటి ప్రభుత్వం వంట ఏజెన్సీలకు ఈ పాత్రలను సరఫరా చేసింది. అప్పటి నుంచి వాటినే ఉపయోగించడంతో పాడైపోయిన పాత్రలతో వంటలు చేసేందుకు నిర్వాహకులు అవస్థలు పడాల్సి వస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను సమూలంగా మార్చేశారు. నాడు-నేడు పథకంలో భాగంగా కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల్లో వసతులు కల్పించారు. ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చారు. చక్కని బోధన ప్రణాళికను అమలు చేస్తుండడంతో ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనం వండిపెట్టే ఏజెన్సీలకు వంట పాత్రల సమస్య ఎదురైంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం సమస్యను పరిష్కరించడానికి కొత్త పాత్రల పంపిణీ చేపట్టింది.

173 పాఠశాలలకు పంపిణీ

నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 123 ప్రాథమిక, 12 ప్రాథమికోన్నత, 38 ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలను ఆరు కేటగిరీలుగా విద్యాశాఖ అధికారులు విభజించారు. 30 మందికి లోపు విద్యార్థులున్న పాఠశాలలు ఎ-కేటగిరీ, 31 నుంచి 50 వరకూ విద్యార్థులు ఉంటే బి-కేటగిరీ, 51 నుంచి 150 మధ్య ఉంటే సి- కేటగిరీ, 151 నుంచి 250 మధ్య ఉంటే డి-కేటగిరీ, 251 నుంచి 400 మధ్య ఉంటే ఇ-కేటగిరీ, 400 అంత కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే ఎఫ్ కేటగిరీలుగా పాఠశాలలను విభజించారు. ఏ, బీ కేటగిరీలకు 5 వంటపాత్రలు, సీ,డీ,ఇ కేటగిరీలకు 6 వంట పాత్రలు, ఈ,ఎఫ్ కేటగిరీలకు 11 చొప్పున పెద్దపాత్రలు, బేసిన్లు, కురిపి, హస్తాలు, వడ్డించేందుకు అవసరమైన స్టీలు పాత్రలు అందజేస్తున్నారు.

నాణ్యమైన పాత్రల సరఫరా



మధ్యాహ్న భోజనం తయారీకి, వడ్డించేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్టీల్ పాత్రలు చాలా క్వాలిటీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పాత్రలు దాన్నాళ్ల కిందటి నాటివి. వాటిలో వండేందుకు భోజన నిర్వాహకులు చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరగడంతో పాత్రలు అదనంగా అవసరం అవుతున్నాయి. దీంతో ప్రభుత్వం నూతన పాత్రలను సమకూర్చడంతో పాఠశాలలకు సరఫరా చేస్తున్నాం.

– పి.గురుమూర్తి, ఎంఈఓ-2, నిడదవోలు

దేవరపల్లిలో శ్రీరామ కల్యాణ శోభాయాత్ర



దేవరపల్లిలో శ్రీరాముడి రథ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

దేవరపల్లి: 'ఊరూరా రామ కల్యాణ శోభాయాత్ర' పేరుతో చేపట్టిన భద్రాద్రి శ్రీరామచంద్రమూర్తి వారి రథయాత్ర బుధవారం సాయంత్రం దేవరపల్లి చేరుకుంది. యాత్రకు స్థానిక శ్రీదేవి,భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. రథం ముందు భాగంలో కోలాట భజన నృత్య ప్రదర్శనతో కోలాహలంగా యాత్రను నిర్వహించారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి శ్రీవారి ఆలయ ప్రాగణంలో శ్రీరాముడి కల్యాణం జరుగుతుందని స్థానిక ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా భద్రాద్రి శ్రీరాముడి ఆలయం అర్చకుడు రామభద్రాచార్యులు మాట్లాడుతూ ఊరూరా రామ కల్యాణం శోభాయాత్రను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 8న భద్రాచలంలో ప్రారంభించిన ఈ యాత్ర ఇప్పటి వరకూ తాడేపల్లిగూడెం, చాగల్లు, భీమవరం, మండపాక, ఊనగట్ల, పెనకలమెట్ట గ్రామాల్లో రామ కల్యాణం నిర్వహించినట్టు వివరించారు. దేవరపల్లిలో కల్యాణం అనంతరం కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు యాత్ర చేరుతుందన్నారు. ఈ నెల 25 వరకూ శోభాయాత్ర జరుగుతుందని చెప్పారు. ఆరుగురు అర్చకులు యాత్రలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్నారు.

సమస్యలుంటే చెప్పండి.. పరిష్కరిస్తాం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఉండ్రాజవరంలో కొనసాగుతున్న గడప గడపకూ..



ఉండ్రాజవరంలో మహిళకు సంక్షేమ లబ్ధి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: పేదల కష్టాలు తెలుసుకున్న జగనన్న వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. ఉండ్రాజవరం పంచాయతీ పరిధిలోని ఆర్‌కే నగర్ కాలనీ, ఎస్సీ ఏరియాలలో రెండో రోజు బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సర్పంచ్ మెండే వెంకట్రావు ఆధ్వర్యంలో, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇక్కడి కుటుంబాలకు చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరించి, ప్రజలకు బ్రోచరు ఆందజేశారు. సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎవరైనా అర్హత ఉండి కూడా పథకాలు అందకపోతే వలంటీర్లకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ హయాంలో అన్ని పథకాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలకే లభించేవన్నారు. ఇప్పుడా సమస్య లేదన్నారు. టీడీపీ వారైనా సరే అర్హత ఉంటే చాలు తమ ప్రభుత్వం వారికి రావల్సిన పథకాలను అందిస్తోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేక టీడీపీ నాయకులు బురద చల్లేందుకు యత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజ, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణఫర్, దాడి నర్సింహరాజు, బీద నర్సింహమూర్తి, చిన్నం సుమన్, గుమ్మడి భాగ్యశ్రీ , ఊబ మంగ, వి.కళ్యాణదేవి, దోనేపూడి సుధాకర్, చదలవాడ సురేష్, గ్రామ బీఎస్సార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రబీకి నీటి ఎద్దడి లేదు



తాళ్లపూడి మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు

తాళ్లపూడి: మండలంలో రబీ సాగుకు ఎలాంటి నీటి ఇబ్బందీ లేదని మండల వ్యవసాయాధికారి జి.రుచిత స్పష్టం చేశారు. అయితే రైతులు నవంబర్ నెలాఖరుకు ఖరీఫ్ వరి కోతలు పూర్తి చేసుకుని, డిసెంబర్ 31 లోగా రబీ వరి నాట్లు పూర్తి చేయాలని సూచించారు. రబీ నాట్లు ఆలస్యం అయితే పంట చివరిలో నీటి ఎద్దడి ఎదురయ్యే ముప్పు ఉందని ఆమె హెచ్చరించారు. ముందస్తు రబీ సాగు సన్నాహాలపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఎత్తిపోతల పథకాల ద్వారా వరి వేసే వారు డిసెంబర్ నెలాఖరులోగా నాట్లు పూర్తయ్యేలా చూసుకోవాలని ఏవో అన్నారు. అలాగే అవకాశం ఉన్న ప్రాంతాల రైతులు వరికి బదులు తక్కువ నీటితో గట్టెక్కే మినుము,పెసర, నువ్వులు వంటి ఆరుతడి పంటలను వేసుకోవాలని సలహా ఇచ్చారు. గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. రబీకి అవసరమైన యూరియాను ముందుగానే రైతు భరో సా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతామన్నారు. సమావేశంలో తహసీల్దార్ టి.రాధిక, పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, ఉద్యాన సహాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నారుమడులు త్వరగా పూర్తిచేయాలి

నిడదవోలు రూరల్: రబీ సీజన్‌లో నీటి ఎద్దడి లేకుండా రైతులందరూ నారుమళ్లు త్వరగా పూర్తిచేయాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం ఆర్‌బీకేలో నిడదవోలు మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకే కేంద్రాల పరిధిలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డిసెంబర్ 10 లోపు నారుమళ్లు పూర్తిచేసేలా రైతులు సన్నద్ధం కావాలని కోరారు. రైతులకు పగటిపూట 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈకార్యక్రమంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

మార్చి 31న కాలువలు మూసేస్తారు

ఉండ్రాజవరం: మండలంలోని రైతులందరూ డిసెంబర్ 31 నాటికి రబీ వరి నాట్లు పూర్తి చేసుకోవాలని ఏవో ఎం. విశ్వాసరావు సూచించారు. రబీ సాగు సన్నాహక సమావేశాన్ని చివటం రైతు భరోసా కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు మార్చి 31న కాలువలను మూసివేస్తారన్నారు. పీఆర్ -126, ఎక్సల్- 10 రకాల వరి విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొఠారు సత్యనారాయణ, కూనపరెడ్డి నర్సింహారావు, మన్నె త్రిమూర్తులు, మట్టా పరమేశు, రైతులు, అగ్రికల్చర్ అసిస్టెంట్ రేష్మ పాల్గొన్నారు.

రఘురాజు పాదయాత్రకు తలారి సంఘీభావం



ఎమ్మెల్సీ రఘురాజు తిరుమల పాదయాత్రలో సంఘీభావంగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అఖండ విజయం సాధించాలని కోరుతూ విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన ఛలో తిరుమల యాత్రకు బుధవారం దేవరపల్లి మండల కృష్ణంపాలెం వద్ద గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కృష్ణంపాలెం నుంచి యర్నగూడెం వరకూ ఎమ్మెల్యే వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ దేవరపల్లి, గోపాలపురం మండలాల కన్వీనర్లు కూచిపూడి సతీష్ , గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, పార్టీ మండల మహిళా విభాగం కన్వీనర్ కడలి హైమావతి, యర్నగూడెం సర్పంచ్ బొంతా భరత్‌బాబు, ఏఎంసీ డైరెక్టర్ సాలి వేణు, పార్టీ నాయకులు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించి, వైఎస్ జగన్ మరలా ముఖ్యమంత్రి కావాలని తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని ప్రార్థిస్తూ ఈ నెల 8న విజయనగరం నుంచి పాదయాత్ర చేపట్టానన్నారు. యాత్ర ఇప్పటికి 15 రోజులు పూర్తయిందన్నారు. తనతో పాటు 26 మంది పార్టీ నాయకులు యాత్ర చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- రావిమెట్లలో సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభం



రావిమెట్లలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని రావిమెట్ల-శంకరాపురం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో ఈ గ్రామస్తులకు రూ.11 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామంలో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.కోటి వ్యయంతో రావిమెట్ల బీసీ కాలనీల్లో పైపులైన్ల ఏర్పాటుతో పాటు కొత్తగా ట్యాంక్ నిర్మించి, తాగునీటి కొరతను తీరుస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పారదర్శకంగా అవినీతి రహిత పాలన అందిస్తున్నామని, లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా సంక్షేమ లబ్ధి అందిస్తున్నామని అన్నారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాల్దారి విజయలక్ష్మి, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీటీసీ సభ్యురాలు ఉప్పులూరి తేజశ్రీ , సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, పార్టీ నాయకులు మిద్దే శ్రీను, ఉప్పులూరి రామకృష్ణ, చిలుకూరి చిట్టి ప్రసాద్, ఇంజే శేఖర్, కాల్దారి శ్రీను, బస్వా సర్వేశ్వరరావు, చదలవాడ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ పి.శామ్యూల్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అవినీతిపై విచారణ



అంగన్‌వాడీలను విచారిస్తున్న కాకినాడ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ప్రవీణ

పెరవలి: అక్రమాలకు పాల్పడిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌పై విచారణ ప్రారంభమైంది. మండలంలోని ఖండవల్లి- 24వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రం నుంచి పెరవలి ఐసీడీఎస్ సూపర్ వైజర్ వనజాక్షి అక్రమంగా సరుకులు తీసుకెళుతూ ఆగస్టు 16న పట్టుబడ్డారు. దీనిపై కాకినాడ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణ బుధవారం ఖండవల్లిలో విచారణ జరిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులను విచారించి, వారి నుంచి లిఖిత పూర్వకంగా వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ మాట్లాడుతూ విచారణలో బయటపడిన కొత్త విషయాలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తానని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి రేషన్ తలిస్తుండగా నేరుగా పట్టుకుని అధికారులకు అప్పగించి నేరం రుజువై మూడు నెలలైనా ఐసీడీఎస్ సూపర్ వైజర్ వనజాక్షిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో తమకు అర్థం కావడం లేదని ఎంపీటీసీ సభ్యులు బొకే వెంకటేశ్వర్లు, పల్లేటి రవి ఆవేదన వ్యక్తం చేశారు.

యాజ్ఞవల్క్య జయంతి నాడు వేద పండితులకు సత్కారం

నిడదవోలు: స్థానిక చినకాశిరేవులోని సూర్య యాజ్ఞవల్క్య ఆంజనేయ సద్గురు మందిరంలో బుధవారం యాజ్ఞవల్క్య జయంతి నిర్వహించారు. వేద పండితులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్నా కృష్ణబాబు ఆధ్వర్యంలో గురుపూజ, రుద్రాభిషేకాలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. అనంతరం భద్రాచలం సీతారామ, చంద్రస్వామి ఆలయ వేద పండితుడు బ్రహ్మశ్రీ లింగాల రామకృష్ణ ప్రసాద్, అవధాని దేవరభట్ల పుల్లయ్యశాస్త్రి, ఆయుర్వేద వైద్యులు రెడ్డి రామమోహన్‌రావులను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పొన్న కృష్ణబాబు, కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో తుట్టగుంట భైరవమూర్తి, లింగాల శ్రీనివాసశర్మ, రెడ్డి సూర్యప్రకాష్‌శర్మ, పొన్నా రాజశేఖర్, తుట్టగుంట ఉదయ భాస్కరరావు, కాశీవిశ్వనాథశర్మ, పొన్నా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు పెరిగేలా జగన్ పాలన

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- గ్రామాల్లో సందడిగా వై ఏపీ నీడ్స్ జగన్
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు



గోపాలపురం మండలం కొవ్వూరుపాడులో డిస్ ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి



చివటంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

గోపాలపురం: అన్ని రంగాల్లోనూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు బలంగా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం పల్లెల్లో ఉత్సాహంగా సాగుతోంది. మండలంలోని కొవ్వూరుపాడులో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాలు పెంపొందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం గ్రామంలో పల్లె నిద్ర చేపట్టారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, సర్పంచ్ చిలకా లక్ష్మణ స్వామి, ఎంపీటీసీ సభ్యుడు యడ్లపల్లి సూరిబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వేగివాడ శ్రీను, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే మస్తాన్ బాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కె వల్లీ పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం-2 గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సమిశ్రగూడెంలో రూ.37.04 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.17.95 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన సమాచార బోర్డులను వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాల్లో పార్టీ నాయకులు దేశాబత్తుల నాగు, అంగర శ్రీను, కస్తూరి సాగర్, వడల అంబేడ్కర్, రహీమ్, కార్యదర్శి ప్రకాశరావు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి? అంటే ప్రజలందరి సంతోషం కోసమని ఎంపీపీ బంక జయలక్ష్మి అన్నారు. అనంతపల్లి-1 సచివాలయం పరిధిలో సర్పంచ్ కమలకుమారి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఈ సచివాలయం పరిధిలో సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చేసిన రూ.30.40 కోట్ల ఖర్చు వివరాలతో కూడిన సమాచార బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యడ్లపల్లి మార్త, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి రాజ్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జాజుల దుర్గారావు, తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ రాజశేఖరం, ఈఓపీఆర్డీ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో ఛివటం సచివాలయం వద్ద సొసైటీ అధ్యక్షుడు కొఠారు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పొలాటి యల్లారేశ్వరి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ లబ్ధి చేకూర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికలల్లో ఆశీర్వదించాలన్నారు. అనంతరం గ్రామంలో సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాల బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కానూరి వీరాస్వామి ఎగరవేశారు. ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు ఆందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు గంటిన లక్ష్మీ గణపతి, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, రాజమండ్రి శివ, కోలా గణపతి, అక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో విద్యాశాఖ డివిజన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

కొవ్వూరు: విద్యా శాఖ డివిజన్ కేంద్రాన్ని కొవ్వూరులో ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక మునిసిపల్ హైస్కూల్లో బుధవారం సాయంత్రం కొవ్వూరులో డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంల సమావేశం జరిగింది. డివిజన్ అధ్యక్షుడు కె.ఫణి శేఖర్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర సంఘం సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ తన ప్రసంగంలో హైస్కూళ్లలో హెచ్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కొవ్వూరు రెవెన్యూ పరిధిలోని తొమ్మిది మండలాలు జిల్లాల పునర్విభజనతో మూడు విద్యా శాఖ డివిజన్‌లలో ఉండడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పాఠశాలల విద్యుత్తు బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని పలువురు కోరారు. విద్యా సంవత్సరం మొదలై ఇప్పటికే ఆరు నెలలైనందున పాఠశాలల నిర్వహణ బిల్లులను తక్షణం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మంగిన శ్రీరామారావు, ఆర్థిక కార్యదర్శి జి.గణపతిరావు, హెడ్ క్వార్టర్ సెక్రటరీ ఎస్‌ఎల్‌వీ రమేష్, డివిజన్ కార్యదర్శి షేక్ నూర్జహాన్ పాల్గొన్నారు.